జగనన్న పిలుపే ప్రభంజనం


సభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి

- విజయవంతంగా బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం
- వేలాదిగా తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు
- వక్తల ప్రసంగాలకు మిన్నంటిన జనాల చప్పట్లు
- కార్యక్రమానికి రథసారధిగా అడుగులు వేసిన ఎమ్మెల్యే తాటిపర్తి


వైఎస్సార్ విగ్రహం వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం విజయవంతమైంది. తొలుత ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా కదం తొక్కారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తర్వాత పార్టీ జెండాలను రెపరెపలాడించుకుంటూ సభా స్థలానికి చేరుకున్నారు. సమావేశ భవనం అభిమానులతో కిక్కిరిసిపోయింది. ప్రజాప్రతినిధులు ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున కేరింతలు పెట్టారు. చప్పట్లు కొడుతూ ప్రజావ్యతిరేక కూటమి ప్రభుత్వంపై ఉన్న తమ అసంతృప్తిని వ్యక్త పరిచారు. సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లపై విమర్శల వర్షం కురిపిస్తున్న సమయంలో యువ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ కేకలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు ఇచ్చిన బాబు ష్యూరిటీ బాండ్‌ల గురించి వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు వివరిస్తున్న సమయంలో మోసం, దగాకోరు ప్రభుత్వం, ప్రజా వ్యతిరేకులు కూటమి నాయకులు, దోపిడీ దొంగలకు నాయకులు.. అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గంలో ఉన్న 213 గ్రామాల నుంచి అభిమానులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని నాయకులను రెట్టింపు ఉత్సాహాన్ని కలిగించారు. దర్శి ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు అరె శ్యామల, యనమల నాగార్జున యాదవ్‌ల ప్రసంగాలు కార్యకర్తలను ఉత్తేజ పరిచాయి. మండలాల నుంచి వచ్చిన పలువురు నాయకులు ప్రసంగించడంతో ఆయా ప్రాంతాల అభిమానులు ఆనందాన్ని వ్యక్త పరిచారు. అధినాయకులను స్వాగతిస్తూ పట్టణంలో అడుగడుగునా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ర్యాలీలో రెప రెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు కూటమి నాయకుల గుండెల్లో దడ పుట్టించాయి. సభ ప్రారంభానికి ముందుగా వచ్చిన అతిథులకు మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, ఆళ్ల సుబ్బమ్మ, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, జాన్‌పాల్, మండల పార్టీ అధ్యక్షుడు గంట వెంకట రమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి, వివిధ విభాగాల నాయకులు ఉడుముల శ్రీనివాస రెడ్డి, షేక్ అబ్దుల్ మజీద్, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, కె.ఓబులరెడ్డి, ఉడుముల అరుణ, గుమ్మా ఎల్లేష్ యాదవ్, ఆర్.అరుణాబాయి, పల్లె సరళ, ఆళ్ల ఆంజనేయరెడ్డి, రంగబాబు, శంబిరెడ్డి, సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసులు, జానకిరఘు, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్, ఎ.రాంభూపాల్‌రెడ్డి, చిట్యాల యోగిరెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, పి.రామాంజనేయరెడ్డి, షేక్ బుజ్జి పాల్గొన్నారు.


సభకు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

సంక్షిప్తంగా

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


శంకరమ్మకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: దొనకొండ, చిన్నగుడిపాడు గ్రామాల్లోని పలు కుటుంబాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. దొనకొండ బేతేలుపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గోనే సామ్యేలు గుండెపోటుతో మృతి చెందటంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుండె సమస్యతో బాధపడుతున్న అజీమ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యామిరెడ్డి శంకరమ్మను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. చిన్నగుడిపాడులో ఇటీవల చెట్టు నుంచి పడి చనిపోయిన కార్యకర్త సూరా శివారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బూచేపల్లి వెంట మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, జిల్లా యాక్టివిటీ సభ్యులు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినుకొండ కొండలు, మండల ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసులు, విప్పర్ల సుబ్బయ్య, షేక్ గఫార్, తమ్మనేని సుబ్బారెడ్డి, ముజాయిద్, పాపా, గొంగటి పోలిరెడ్డి, పిక్కిలి అంకయ్య, దోలా చంద్రా, అచ్చయ్య పాల్గొన్నారు.

దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

దొనకొండ: దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వలసలు నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక వీపీపురంలో శనివారం వ్యవసాయ కార్మిక సమావేశం కుందుర్తి చిన్న నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన సందర్భంలో దొనకొండ ప్రాంతం రాష్ట్ర రాజధానిగా మారుతుందని, తమ బతుకుల్లో వెనుకబాటు తనం పోయి అభివృద్ధి సాధిస్తామని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. పాలకులు దాన్ని వదిలేశారని విచారం వ్యక్తం చేశారు. విదేశీయులు దొనకొండ ప్రాంతాన్ని చూసి పోవటం తప్పా ఏ ఒక్క పరిశ్రమ పెట్టలేదన్నారు. పాలకులు చెప్పిన మాటలు నేడు నీటి మూటలుగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. దొనకొండ ప్రాంతంలో ఏడాదికి 200 రోజుల ఉపాధి పనులు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ఆంజనేయులు డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజల ఆశ వెలుగొండ ప్రాజెక్టును 30 ఏళ్లుగా పాలకులు అదిగో ఇదిగో అని ఊరిస్తున్నారన్నారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కనీసం రూ.4 వేల కోట్లు అవసరమన్నారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోగా రూ.300 కోట్లతో ఎంత కాలానికి ప్రాజెక్టు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ 6 పథకాలను వెంటనే అమలు చేయాలని అంజయ్య కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొండా చిన్న ముసలయ్య, కార్యదర్శి కుందుర్తి చిన్న నరసింహులు, రాయని చెన్నయ్య, ముసుగు నాగమణి, బెల్లం దుర్గ తదితరులతో కమిటీ ఏర్పాటు చేశారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం భద్రం

ముండ్లమూరు (దర్శి): ఔషధ మొక్కలతో ఆరోగ్య భద్రత ఉంటుందని కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీత అన్నారు. ఐతఈఆర్‌డీ ఆధ్వర్యంలో 2025–26 మొక్కల పంపిణీ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ పూర్వీకులు ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచేందుకు ప్రకృతి సిద్ధమైన ఔషధ మొక్కలను నిత్య జీవితంలో భాగంగా వినియోగించేవారని చెప్పారు. నేడు మనం నాటుతున్న మొక్కలు రేపటి తరానికి ఆయురారోగ్యాన్ని అందించగలవని స్పష్టం చేశారు.. విద్యార్థుల్లో పచ్చదనంపై ప్రేమను పెంపొందించడం, ఆయుర్వేదంపై ఆసక్తి కలిగించేలా చేసేందుకు ఇది మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 70 వేర్వేరు రకాల తులసి, అశ్వగంధ, బ్రాహ్మి, అలోవెరా, శతావరి, కాలమేఘ, మందార ఎర్రచందనం, శ్రీగంధం, అల్లం, ఉసిరి, పిప్పింట, రణపాల, మొక్కలు నాటారు. ప్రతి మొక్క ప్రయోజనాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు వాటి సంరక్షణ కోసం ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. ఐతఈఆర్‌డీ సంస్థ అధ్యక్షుడు బత్తుల కిరణ్ చంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ బాలికల వసతి గృహం పరిశీలన


విద్యార్థినులతో మాట్లాడుతున్న హేమలత

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన టైపు 4 కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని ఒంగోలు సమగ్ర శిక్షణ జీసీడీఓ కె.హేమలత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. వసతి గృహ ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్నకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు త్వరలో కల్పిస్తామని చెప్పారు. జిల్లాలో మొదటిగా ఈ వసతి గృహం దొనకొండలో ప్రారంభించినందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ వసతి గృహంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, సమస్య ఉంటే వెంటనే ప్రత్యేకాధికారికి తెలియజేయాలన్నారు. హెచ్ఎం వీవీ రామాంజనేయులు, కేజీబీవీ ప్రత్యేకాధికారి మమత ఉన్నారు.